క్లుప్తంగా

సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ కార్మికులు జీఓ నంబర్ 60 ప్రకారం పెంచిన వేతనాలు అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె మున్సిపల్ కమిషనర్ హామీతో శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ నెల నుంచి పెంచిన వేతనాలు చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించి విధులకు హాజరవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నేతలు ఆర్ మధుసూదన్‌రెడ్డి, గౌస్, గద్దల శ్రీనివాసరావు, ఉప్పుతల నర్సింహారావు, ఎం రాజేందర్, బత్తుల వెంకన్న, పల్లపు నాగేశ్వరరావు, పద్మ, కార్మికులు లక్ష్మీనారాయణ, దుర్గయ్య, అనిల్, రత్నాకర్, నర్సింహారావు, రమాదేవి, చంద్రయ్య, సాయమ్మ, వేణు, అన్నపూర్ణ, రాంబాబులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీనృసింహ యాగం



యాగం చేపడుతున్న నిర్వాహకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అహోబిలమఠం వేదికగా శ్రీనృసింహ సేవావాహిని ఆధ్వర్యంలో లోక క్షేమం కోరుతూ అంగరంగ వైభవంగా శ్రీనృసింహ యాగాన్ని సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో దీక్షా పరులు, భక్తులతో కలిసి ప్రారంభించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ యాగంలో ప్రతి రోజూ లక్ష ఆవు పిడకలతో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు చైతన్య స్వామి తెలిపారు. గోవు ప్రాముఖ్యత తెలియజేయాలనే ఉద్దేశ్యంతో గత ఆరు సంవత్సరాలుగా ఈ నృసింహ యాగాన్ని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నృసింహ సేవావాహిని బృందం, నృసిం దీక్షా పరులు, వేద పండితులు శ్రీనివాస శర్మ, నవీన్ స్వామి,శ్రీధర్ స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను, ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా గోస-బీజేపీ భరోసా పేరుతో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కేసీఆర్ కుటుంబ పాలనను తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూక్యా ప్రసాద్, గొట్టిపుల్ల దుర్గ శ్రీనివాస్, దారా నాగేశ్వరరావు, ఉడతనేని విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

దమ్మపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీపీఐ జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ.. దళిత బంధుతో పాటుగా గిరిజన బంధును కూడా అమలు చేసి, అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దమ్మపేటకు మంజూరైన కోర్టు నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, జూనియర్ కాలేజి మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, బెజ వాడ రాంబాబు, ధర్మ, లక్ష్మీనారాయణ, జానీబేగం తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తూరుబాక ఉప సర్పంచ్ బొల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తూరుబాక పంచాయతీలోని తురుబాక అంబేడ్కర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆయన కంటివెలుగు కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కంటి వెలుగు డాక్టర్ గాయత్రి, గ్రామపంచాయతీ కార్యదర్శి రవి, సూపర్ వైజర్‌లు రమణమ్మ,శరత్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగగూడెంలో..

గుండాల: మండలంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని లింగగూడెం సర్పంచ్ నర్సింహారావు, ఎంపీటీసీ రాజేశ్వరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని శుక్రవారం మండలంలోని లింగగూడెం పంచాయతీ కేంద్రంలో ప్రారంభించగా.. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సూపరిడెంట్ ప్రవీన్ రాజ్, కార్యదర్శి రమేష్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుగుబాటు పంచాయి(య)తీ!

- 'బీఆర్‌ఎస్' గ్రామాల్లో ప్రజల నిరసనలు
- మద్దతునిస్తున్న సర్పంచ్‌లు
- ఊపందుకుంటున్న పోరాటం
- సమస్యలు పరిష్కారానికి మరోదారి లేదంటున్న ప్రజాప్రతినిధులు



సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తున్న వేదాంతపురం సర్పంచ్, గ్రామస్తులు (ఫైల్)



ప్రగతిభవన్‌కు పాదయాత్ర చేపట్టిన రామన్నగూడెం జీపీ వాసులు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అధికార పార్టీ పాగా వేసిన గ్రామ పంచాయతీల్లో స్వపక్షం విపక్షంలా మారింది. కొంతకాలంగా ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పరిస్థితులే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. సాధారణంగా విపక్ష పంచాయతీల్లో జరగాల్సిన ఆందోళనలు, దీక్షలు, ధర్నాలు అధికార పక్ష పాలకుల నుంచే తిరుగుబాటు వస్తుండం ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ఓ పంచాయతీలో మొదలైన పోరాటాలు కాస్తా నెమ్మదిగా.. మిగిలిన పంచాయతీలకు పాకుతున్నాయి.

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలో ఉండగా, వీటిలో గాండ్లగూడెం, కావడిగుండ్ల, కోయ రంగాపురం, పాత అల్లిగూడెం, దిబ్బగూడెం, నందిపాడు, మొద్దులమడ, పేరాయిగూడెం గ్రామ పంచాయతీల్లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఎం, టీడీపీలకు చెందిన వారే సర్పంచ్‌లు. మిగిలిన అన్ని పంచాయతీలను ఆ నాటి స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ(ప్రస్తుతం బీఆర్‌ఎస్) కైవసం చేసుకుంది. కాగా గడిచిన నాలుగేళ్లుగా అధికార పార్టీ పంచాయతీల్లో పాలన సజావుగానే సాగుతుండగా, కొన్ని అధికార పార్టీ పంచాయతీల్లో సమస్యలు, అభివృద్ధి డిమాండ్‌ల పేర్లతో ఆందోళనలు సాగుతున్నాయి. తాజాగా గుర్రాల చెరువు గ్రామ పంచాయతీ వాసుల ఆందోళనతో ఇదీ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ తిరుగుబాటు స్వరాలన్నీ అధికార పార్టీ పంచాయతీల్లోనే సాగడం చర్చనీయంశంగా మారింది.

'రామన్నగూడెం'లో మొదలై..

మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయతీలో మొత్తం గిరిజనులే కాగా, వీరంతా ఒకే తాటిపై ప్రయాణిస్తుంటారు. ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా మడకం స్వరూప గెలుపొందారు. అధికార పార్టీ నుంచి గెలిచిన తర్వాత మూడున్నర ఏళ్ల వరకు సజావుగానే పాలన సాగించారు. ఇంతలో ఏమైందో ఏమోగాని గతేడాది జూన్ 27న 'ప్రగతిభవన్'కు పాదయాత్రతో ఆందోళన మొదలు పెట్టారు. ఆ తర్వాత అధికార పార్టీలో ఉంటూనే నిరహార దీక్ష చేపట్టారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాదయాత్రలో పోలీసులు, అధికార పార్టీ నాయకుల తీరుతో గ్రామ పంచాయతీ సర్పంచ్ స్వరూప బీఆర్‌ఎస్ పార్టీకు సైతం రాజీనామా చేశారు. ఆ నాటి నుంచి అవకాశం ఉన్నప్పుడల్లా ధర్నాలు, నిరసనలు చేపడుతూనే ఉన్నారు. కొద్ది రోజుల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయానికి పక్కా భవనం మంజూరు కాలేదని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు.

వేదాంతపురంలోనూ..

మండలంలోని వేదాంతపురం గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్‌గా సోని శివ శంకర్ ప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్ పార్టీలో చేరి పాలన సాగిస్తున్నారు. మూడేళ్లు దాటుతున్న సమస్యలు తీరకపోవడంతో ఈ పంచాయతీ పరిధిలోగల తిమ్మాపురం గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. గత జూన్ 27వ తేదీ నుంచి పోరుబాట సాగించారు. గ్రామంలో కనీస వసతులు, సౌకర్యాలు లేకపోవడంపై అధికార పార్టీ సర్పంచ్ పలుమార్లు ఆయన స్థానిక, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదు. దాంతో సర్పంచ్ ఆధ్వర్యంలోనే గ్రామస్తులంతా కలిసి పలుమార్లు దీక్ష చేపట్టారు. ఈ దీక్షలు, నిరసనలతో ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి విద్యుత్ సౌకర్యాన్ని రోజుల వ్యవధిలోనే సమకుర్చారు. అనంతరం ఈ పంచాయతీలో ఆందోళనలు ప్రస్తుతానికి ఆగాయి.

తాజాగా గుర్రాల చెరువు..

నియోజకవర్గ కేంద్రం, అశ్వారావుపేటకు కూతవేటు దూరంలో ఉండే గుర్రాల చెరువు గ్రామ పంచాయతీ సైతం అధికార పార్టీ చేతుల్లోనే ఉంది. ఈ పంచాయతీ నుంచి సర్పంచ్‌గా కలపాల దుర్గయ్య పాలన సాగిస్తుండగా, అనేక సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఈ సమస్యలను ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో పంచాయతీ పరిధిలోని మారుతీనగర్ వాసులు పోరాటాలకు దిగారు. సోమవారం ఏకంగా జిల్లా కలెక్టర్ వద్దకే అధిక సంఖ్యలో మహిళలు తరలి వెళ్లి సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. దాంతో హుటాహుటిన డీఎండబ్ల్యూఓ సంజీవరావు ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈ పంచాయతీ నుంచి సర్పంచ్ మాత్రం ఈ ఆందోళనకు దూరం ఉండటం గమనార్హం.

అన్ని పంచాయతీలు కూడా అధికార సర్పంచ్‌లు సారథ్యం వహించేవే కావడం, సమస్యలను పరిష్కరించకపోవడమే ప్రజానీకం గొంతెత్తేలా చేస్తోంది. ఆయా గ్రామస్తులు పోరాటాలు, ఆందోళనలు, దీక్షలు చేస్తేనే ఉన్నతాధికారుల స్పందించడం, వాటిని పరిష్కరించడంతో ఆయా పంచాయతీల్లో గల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహంలా మారుతున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. దాంతో తాము(ప్రజాప్రతినిధులు) మొరపెట్టుకున్న పట్టించుకోని అధికార యంత్రాంగం ప్రజానీకం రోడ్డెక్కితే పరిష్కరిండంతో తమకు ప్రాధాన్యత లేకుండా పోతుంద భావిస్తున్నారు.

సింగరేణి డైరెక్టర్లకు వినతి



మణుగూరు ఏరియాకు వచ్చిన డైరెక్టర్లకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నేతలు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్లకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాల నేతల ఏరియా సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం నాయకులు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు సంఘం నేతలు ఏరియా జీఎం కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్లతోపాటు డైరెక్టర్(పా)ను కలిసి ఏరియా సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అందులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తిచేయడం, పాత ఎంసీ క్వార్టర్స్‌కు ఆదనపు పార్కింగ్ షెడ్లు నిర్మించడం, ఓసీ-2లోని కనకదుర్గమ్మ ఆలయం తరలింపు దృష్ట్యా నూతన కార్యాలయ నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు కేటాయించడం తదితర సమస్యలను పొందుపరిచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో కంపెనీ హైదరాబాద్ రిఫరల్ చేస్తుందని, అక్కడ కార్పొరేట్ హస్పిటల్‌కు సింగరేణియులకు అనుసంధాన కర్తగా ఉన్న వ్యక్తిని పూర్తిస్థాయిలో సర్వీస్ అందించలేకపోతున్నాడని వివరించారు. సమస్యలపై డైరెక్టర్స్ సానుకూలంగా స్పందించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి కమిటీ నాయకులు వీరభద్రయ్య, కాపా శివాజీ, బానోత్ కృష్ణలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలో శ్రీదేవి, భూదేవి అభినవ వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణమహోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజారుల వేదమంత్రాలతో స్వామి వారి కల్యాణమహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్వామి కల్యాణమహోత్సవంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి సుధారాణి, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ గాదె జయ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన భక్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోగల శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద జరుగుతున్న జాతర ఉత్సవాలకు శుక్రవారం రాత్రి భక్తులు పోటెత్తారు. ఈ జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడిపోయింది. జాతర సందర్భంగా ఆలయం నిర్వహించిన డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. కాగా భక్తుల రద్దీ కారణంగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కాషాయజెండా ఎగురవేయాలి



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భద్రాచలంఅర్బన్: భారతీయ జనతా పార్టీ ప్రజాగోస.. భరోసా కార్నర్ మీటింగ్ పార్టీ భద్రాచలం మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్ రావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అన్నం హరీశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మెజార్టీతో భద్రాచలం నియోజకవర్గంలో గెలిపించి, కాషాయ జెండా ఎగరవేయాలని ప్రజలను, కార్యకర్తలను కోరారు. గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్లు, సీసీ రోడ్లు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, వీటన్నిటికీ కేంద్ర ప్రభుత్వం నిధులతోనే కట్టిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ త్రినాధరావు, జాయింట్ కన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సతీష్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు కోటేశ్వరి, చర్ల మండల అధ్యక్షుడు కన్నయ్య, భద్రాచల మండల ప్రధాన కార్యదర్శి చెలుపోయిన వెంకన్న, ఉపాధ్యక్షుడు సుదర్శన్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జయరాజు, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు ఉపేందర్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, కార్యదర్శి శ్రీను నియోజకవర్గ మీడియా కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి స్థానిక చిరు వ్యాపారులు, ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ

పినపాక: మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులకు సరైన భోజనం పెడుతున్నారో లేదో ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలలో బియ్యం, కూరగాయలు, సరుకులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

విద్యుత్ ఏఈకి వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని ఆమెర్ద గ్రామ పంచాయతీలోని అమెర్ద కాలనీ గ్రామంలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్య పరిష్కరించాలని బీఆర్‌ఎస్ యువజన నాయకులు శుక్రవారం ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లను తాకుతూ చేతికి అందె ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నజీర్‌షాను, జూపల్లి కిరణ్, ఇరుగు నాగరాజు, మోదుగు వంశి, మేకల భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

అశ్వారావుపేట: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం అశ్వారావుపేటలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ టెస్ట్‌ను ఏఎస్‌ఎఫ్ నాయకులు ఖాసీం, సాత్విక్, ప్రసాద్,నవీన్ తదితరులు పర్యవేక్షించారు.

కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

ములకలపల్లి: మోరంపల్లి బంజరలో ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.ఉమర్ పిలుపు నిచ్చారు. సంఘ జిల్లా నాయకులు కుంజా కృష్ణ అధ్యక్షతన ములకలపల్లిలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రైతులు-కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంపై కౌన్సిల్‌లో సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిగొండ మల్లయ్య, ఆదినారాయణ, ఖాసీం, చావళ్ల సీతారాములు తదితరులు పాల్గొన్నారు,

జాతరలో అమ్మవారికి మంగళ స్నానం



అమ్మవారికి 101 బిందెల జలాలతో స్నానం చేయించడానికి సిద్ధంగా ఉన్న మహిళలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి 22వ జాతర 5వ రోజు శుక్రవారం అమ్మవారికి ఆడపడుచులు ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన 101 బిందెలతో జలంతో మంగళ స్నానం చేయించారు. ఆలయం పక్కన గల మర్రిచెట్టు వద్ద మహిళలు భారీగా చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు అమ్మవారి తాంబూలాలైన పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలను ప్రసాదాలను అందించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు చుక్క గణేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన సతీష్ సినీ ఆర్కెస్ట్రా సంగీతా విభావరి ఆహుతులను అలరించింది.

'ఈ-శ్రమ్' గొప్ప వరం

మణుగూరురూరల్: అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ పథకం ఒక గొప్ప వరమని మణుగూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బీఎస్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నట్లైతే సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. 16-59 సంవత్సరాల మధ్య ఉండి ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు లేని అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు మాత్రమే పథకానికి అర్హులని తెలిపారు.

అర్హత గల కార్మికులు తమ ఆధార్, ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతా పుస్తకాల పత్రాలతో సమీప కామన్ సర్వీస్ సెంటర్‌లలో నమోదు చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ కార్మికులు మీసేవా కేంద్రాల్లో రూ.110 చెల్లించి లేబర్ ఇన్సూరెన్స్ పొందాలని తెలిపారు. తద్వారా సాధారణ మరణం సంభవిస్తే రూ.1.30లక్షలు, ప్రమాదవశాత్తు మరణం రూ.6.30లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.4లక్షల బీమా పొందవచ్చన్నారు.

కార్మికుల సమస్యలు వివరించాం..



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు, వెంకటరెడ్డి

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను భారజల బోర్డు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరామని భారజల కర్మాగారం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడ్య కేశవ రావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం భారజల కర్మాగారం గేటు వద్ద జరిగిన సమావేశంలో ఉద్యోగులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ నెల 2న ముంబైలో భారజల బోర్డు యాజమాన్యంతో దేశంలోని అన్ని భారజల కర్మాగారాల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశం కాగా మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగుల సమస్యలు విన్నవించామన్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులు రాజేందర్, రాజేశం, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాదయాత్రపై సమావేశం

అశ్వాపురం: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్ర విజయవంతంపై శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు తాళ్లూరి చక్రవర్తి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు, బట్టా విజయగాంధీ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ సమావేశంలో పాల్గొని యాత్ర విజయవంతంపై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, కణితి కృష్ణ, సర్పంచ్ బట్టా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కాకా రాములు, నాయకులు తూము వీరరాఘవులు, వెంకటరమణ, చెన్నయ్య, మోసిన్, నరసింహారావు, వీరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రశంస



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దేవదాసు

భద్రాచలం: జేఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్షలో ప్రతిభ చాటిన భద్రాచలం గిరిజన గురుకులం కళాశాలకు చెందిన విద్యార్థినులకు అభినందనలు అందుతున్నాయి. పరీక్షకు 38 మంది హాజరు కాగా, ఇందులో 23 మంది బాలికలు అడ్వాన్స్‌కు క్వాలిఫై అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న బి.హేమశ్రీ 84.529 పర్సంటైల్, జి. శైశల్య 79, బి.కావ్య 77.4, కె.లక్ష్మి 70.7 పర్సంటైల్ సాధించారు. దీంతో వీరిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు పుష్పగుచ్ఛంతో అభినందించారు.

బీటీపీఎస్ సీఈకి శుభాకాంక్షలు



సీఈ బిచ్చన్నకు క్యాలెండర్ అందజేస్తున్న జగన్

మణుగూరురూరల్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బిచ్చన్నను భారతి సెక్యూరిటీ సర్వీసెస్ ఎండీ చింతపల్లి జగన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బిచ్చన్నకు అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఈతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్, రమణమూర్తి, వెంకన్న, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు'కు పట్టాలు ఇవ్వాలి



అన్నపురెడ్డిపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు

దుమ్ముగూడెం: మండలంలో పోడు సాగు చేస్తున్న ప్రతి ఒక్క గిరిజనుడికీ పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సరియం రాజమ్మ, కొర్సా చిలకమ్మాలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో పోడు సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలంలో 22 గ్రామపంచాయతీ పరిధిలో సాగు చేస్తున్న ఆదివాసీలందరికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తోడం తిరుపతిరావు, సర్పంచ్‌లు మీడియం జయ, పూనెం కనకదుర్గ, పెసా కమిటీ చైర్మన్ సున్నం వెంకటేశ్వర్లు, పూనం వెంకన్న బాబు, తుర్రం సుబ్బారావు, సోయం భూపతి, కారం కామయ్య,మంగమ్మ, మచ్చా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలో పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు అందరికీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి తహసీల్ వరకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, రావుల శోభన్‌బాబు, కేశవ రావు, దుర్గ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: అర్హులైన పోడుసాగుదారులందరికీ హక్కు పత్రాలను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. ఆర్ఐ మధుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, కోటయ్య బాబురావు, కృష్ణ, లక్ష్మి, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రతి పోడు సాగుదారుడికి హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి, స్థానిక తహసీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ సుచరితకు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిరంజీవి, గడ్డం సత్యనారాయణ, గంగరాజు, రాజాబాబు, తిమ్మయ్య, జోగారావు, వెంకటేశ్వర రావు ఉన్నారు.